



ప్రజాపోరు యాత్రలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు

విద్యారంగానికి 30 శాతం నిధులు

• ప్రాథమిక పాఠశాలలను మూసివేయరాదు • యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు
• గూడూరులో యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు ప్రారంభం • యుటిఎఫ్ జెండాలతో ఎరుపుమయం

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్ /గూడూరు

పాఠశాల విద్యా రంగానికి బడ్జెట్‌లో 30శాతం నిధులను కేటాయించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలను మూసివేయకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని పేర్కొన్నారు. శనివారం గూడూరు పట్టణంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) కర్నూలు జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం పాత బస్టాండ్ సర్కిల్ నుండి జీనియస్ పాఠశాల యుటిఎఫ్ మహాసభల ప్రాంగణం వరకు యుటిఎఫ్ జెండాలతో ఉపాధ్యాయులు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యుఆర్ఎ రవికుమార్ అధ్యక్షతన మొదటి రోజు బహిరంగ సభ నిర్వహించారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను యుటిఎఫ్ పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎం.పంపావతి ఎగురవేశారు. ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని పూర్వ జిల్లా కార్యదర్శి భాస్కర్ బాబు, యుపిఎస్ పథకాన్ని పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎం.జయరాజు ఎగురవేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ అమరవీరులకు పూలమాలలు వేసి వారు నివాళులర్పించారు.


బహిరంగ సభలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

విద్య ప్రయివేటీకరణను అడ్డుకోవాలి

- ఎన్.వెంకటేశ్వర్లు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ఇటీవల కాలంలో విద్యను ప్రైవేటీకరణ చేసే దిశగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాల నుండి ప్రయివేట్ పాఠశాలల్లో చేరిన విద్యార్థుల సంఖ్య దాదాపుగా మూడు లక్షలుగా ఉందన్నారు. ప్రయివేటీకరణను తప్పనిసరిగా ఉపాధ్యాయులు అడ్డుకోవాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. రాజ్యాంగంపై పెద్ద ఎత్తున దాడి జరుగుతుందన్నారు. పాఠ్యాంశాల్లో చరిత్రను వక్రీకరిస్తున్నారని అన్నారు. అందుకే విద్యార్థులకు మన చరిత్ర గురించి తెలియజేయడమే కాకుండా శాస్త్రీయ బోధనను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్య పరిరక్షణ ధ్యేయంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే సాల్ట్ బోధన పద్ధతుల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యను నిర్వీర్యం చేసేందుకు సిద్ధమైందన్నారు. ఈ బోధన విధానాన్ని వ్యతిరేకించాలని కోరారు. అప్రెంటిస్ విధానం రద్దు నుండి మొన్నటి వరకు మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులు వంటి వాటిని సాధించడంలో యుటిఎఫ్ పోరాట ఫలితమేనని పేర్కొన్నారు.

ఒపిఎస్ విధానాన్ని అమలు చేయాలి

- ఇందిరా సుభాషిని, ఆహ్వాన సంఘం అధ్యక్షులు

ఈ సందర్భంగా ఆహ్వాన సంఘం అధ్యక్షురాలు ఇందిర సుభాషిని మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. వెంటనే ఒపిఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఏకైక సంఘం యుటిఎఫ్ అని కొనియాడారు. రానున్న రోజుల్లో మరిన్ని పోరాటాలు చేసి విద్యావ్యవస్థ పటిష్టతకు కృషి చేయాలని కోరారు.

50 ఏళ్ల ఉద్యమంలో కర్నూలుది విశిష్ట స్థానం

- కె.సురేష్ కుమార్, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు



రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో కర్నూలు జిల్లాకు కూడా విశిష్ట స్థానం ఉందన్నారు. ఉపాధ్యాయుడు కర్రెన్న యుటిఎఫ్ ఉద్యమానికి అంకురార్పణ చేశారని పేర్కొన్నారు. అందులో భాగంగానే స్వర్ణోత్సవ సంబరాలను కోడుమూరు ప్రాంతమైన గూడూరులో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే కాలంలో ఉపాధ్యాయులు సామాజిక పోరాటాలను కూడా చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.


అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న మహిళా ఉపాధ్యాయులు

ఐక్య ఉద్యమాలను నిర్మించాలి

- గోకారి, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు

ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు గోకారి మాట్లాడుతూ రాబోయే కాలంలో ఉపాధ్యాయులు ఐక్య ఉద్యమాలకు నిర్మించేందుకు భాగస్వామ్యం కావాలని కోరారు. రాష్ట్రంలో పాలక ప్రభుత్వాలు మారుతున్న వారు అమలు చేస్తున్న విధానాలు మారవన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ విద్యారంగ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునే స్థితిలో లేదన్నారు. అందుకే రాబోయే కాలంలో ఈ ప్రభుత్వం అనుసరించే విధానాలను ఎండగట్టేందుకు సంసిద్ధం కావాలని కోరారు.

విద్యారంగాన్ని కాపాడుకోవాలి

- డి.గౌస్ దేశాయ్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు



సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌసేదేశాయ్ మాట్లాడుతూ 2014 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వం విద్యారంగంపై అనేక రూపాల్లో దాడి చేసిందన్నారు. విద్యను కాషాయీకరణ చేసేందుకు సన్నదమయ్యారన్నారు. విద్యార్థులకు బోధించే పాఠాలను కూడా తొలగించేసి చరిత్రను కూడా భావితరాలకు తెలియకుండా చేస్తున్నారన్నారు. మతతత్వ భావజాలాన్ని విద్యార్థుల్లో పెంపొందించేందుకు దృష్టి సారిస్తున్నారన్నారు. విద్యార్థులను చైతన్యం చేసి విద్యారంగాన్ని కాపాడుకోవాలని ఉపాధ్యాయులను కోరారు.

డిప్యూటీ కలెక్టర్ నిత్యానందరాజు, గూడూరు తహశీల్దార్ రామాంజనేయులు, ఎంఇఒలు సునీలమ్మ, నాగరాజు, కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దావీదు, సహాధ్యక్షుడు హేమంత్ కుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి యెహోషువ, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లప్ప, రాష్ట్ర నాయకులు నాగమణి, జిల్లా కార్యదర్శులు తిమ్మన్న, ఇబ్రహీం, లక్ష్మీదేవి, దుర్గాప్రసాద్, గూడూర్ ఎస్‌టియు గూడూరు మండల అధ్యక్ష కార్యదర్శులు కాంతారావు, షబ్బీర్, మండల అధ్యక్ష కార్యదర్శులు మనోజ్, హనుమన్న నాయకులు కిషోర్, హనుమంతు ఇతర మండల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఇందిరా సుభాషిని

మోసపూరిత విధానాలపై ప్రజాపోరు

• ప్రజాపోరులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మోసపూరిత విధానాలను వ్యతిరేకించాలని సిపిఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం సిపిఎం ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా కర్నూలు మండలం, ఈ.తాండ్రపాడు గ్రామంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేసే విధానాలు అవలంబిస్తున్నారని అన్నారు. దేశంలో ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే నాయకుడు ఉండాలని ఉద్దేశంతో జెమిలి ఎన్నికలు తేవాలని చూస్తున్నారన్నారు. ఇది పూర్తిగా ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కడమేనని విమర్శించారు. వక్స్ బోర్డ్ భూముల సమస్యపై వివాదం చేస్తూ కార్పొరేట్ కంపెనీలకు ఆ భూములు అప్పచెప్పాలనే విధానం అవలంబిస్తున్నారని అన్నారు. మత రాజకీయాలు చేస్తూ ప్రజలను వేధిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి ఆధ్వర్యంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ప్రజలపై భారాలు వేస్తుందని విమర్శించారు. సర్దుబాటు పేరుతో ప్రజలపై కరెంటు చార్జీలు వేస్తున్నారని నిత్యవసర వస్తువులు, వంట నూనె, బియ్యం కందిపప్పు ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఒకటి మాత్రమే అమలు చేసి మిగతా వాటి గురించి మాట్లాడడం లేదని అన్నారు. గ్రామాల్లో సమస్యలు తిష్ట వేసి ఉంటే ఆ శాఖను వదిలేసి హోంశాఖ నాకు ఇస్తే ఇంకోలా ఉంటుంది అని పవన్ కళ్యాణ్ వాక్యాలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. రైతులకు పెట్టుబడి సహాయం కింద ఇస్తామన్నా రూ.20వేలు వెంటనే ఇవ్వాలని, మహిళల కోసం ఉచిత బస్సు సౌకర్యం అమలు చేయాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ప్రతినెలా రూ.1500 ఇస్తామన్న హామీ, డిఎస్‌సి విడుదల, తల్లికి వందనం పేరుతో ఇస్తామన్న రూ.15 వేలు, నిరుద్యోగ భృతి, ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఈ నెల 14న కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిపిఎం మండల కార్యదర్శి ఉసేనయ్య, మండల నాయకులు రాఘవేంద్ర, ఆంజనేయులు, బాలపీర, వెంకటేశ్వర్లు ఎమ్మెస్ బాబు, గోపాల్, రామంజులు, కెటి.వెంకటేశ్వర్లు, మధు, వెంకటస్వామి, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ బి. నవ్య

విద్యతో సమాజ మార్పునకు నాంది

- జాయింట్ కలెక్టర్ నవ్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యతోనే సమాజ మార్పునకు నాంది పలుకుతుందని జెసి బి.నవ్య అన్నారు. శనివారం నగరంలోని డాక్టర్ అబ్దుల్‌హక్ ఉర్దూ యూనివర్సిటీ 8వ వ్యవస్థపాక దినోత్సవం నిర్వహించారు. స్థానిక యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెసి నవ్య హాజరయ్యారు. జెసి మాట్లాడుతూ... ప్రస్తుతం యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సులను నిర్వహిస్తున్నారని తెలిపారు. బాలికలు అధిక సంఖ్యలో విద్యను అభ్యసించడం శుభ పరిణామం అన్నారు. యూనివర్సిటీ అధికారులు విద్యార్థినీలకు ఒక భద్రత భావాన్ని కల్పిస్తుండటంతో వారిలో ఆత్మవిశ్వాసం మరింత పెరిగిందన్నారు. భాష విద్యాభ్యాసనకు అడ్డంకి కాకూడదని భాష ఉన్నత విద్యను అభ్యాసనకు సోపానం కావాలన్నారు. విద్యార్థులు తమ జీవితంలో సాధించాల్సిన లక్ష్యాల కోసం ఏకాగ్రతతో కావాల్సిన నైపుణ్యాలను అలవర్చుకుంటే ఉద్యోగ రంగంలో రాణించేందుకు దోహదపడుతుందన్నారు. యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలు అజ్రా జావీద్ మాట్లాడుతూ నేడు జిల్లా అధికార యంత్రాంగంలో ఉన్నత హోదాల్లో మహిళలు ఉండటం స్త్రీ శక్తి అభివృద్ధికి నిదర్శనం అన్నారు. యూనివర్సిటీ పాలక మండలి జి.ఎండి ఇబ్రహీం, నవీద్ మాట్లాడుతూ యూనివర్సిటీ అభివద్ధి కోసం తమ వంతు ఆర్థిక సహకారాన్ని అందిస్తామన్నారు. ఇంచార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పిఎస్. షావలిఖాన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యూనివర్సిటీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని అన్నారు. ఓర్వకల్‌లో యూనివర్సిటీ నిర్మాణానికి సంబందించిన అప్రోచ్ రోడ్ కు కావాల్సిన భూ స్థల సేకరణ జిల్లా అధికార యంత్రాంగం సహకారంతో తుది దశలో ఉందన్నారు. అది పూర్తి అయిన వెంటనే నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. మైనారిటీ శాఖ తరపున పిఎంజెవికెకింద ఒకేషనల్ , స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుకు నివేదికలు సమర్పించామన్నారు. ఆగిపోయిన యూనివర్సిటీ నిర్మాణ పనులకు పెండింగులో ఉన్న రూ.29 కోట్ల నిధుల విడుదలకు ఉన్నత విద్యా శాఖకు ప్రతిపాదనలు పంపించామన్నారు. యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలు అజ్రా జావీద్ ఆర్థిక సహకారంతో యూనివర్సిటీలో బాలికల కోసం ఏర్పాటు చేసిన ప్రేయర్ హాల్ , రీడింగ్ రూమ్ ను ఇంచార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పిఎస్. షావలిఖాన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. లోకనాథ్‌తో పాటు పాలక మండలి సభ్యులు ప్రారంభించారు.


ఆట ఆడుగతున్న క్రీడాకారులు

సి బెళగల్‌లో సెపక్ తక్రా రాష్ట్రస్థాయి క్రీడలు ప్రారంభం

ప్రజాశక్తి- సి బెళగల్

-సి బెళగల్ గురుకుల బాలయోగి క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి సెపక్ తక్రా క్రీడలను ప్రిన్సిపల్ బలరాం అధ్యక్షతన జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యదర్శి గిడ్డయ్య, అబ్జర్వర్ రమేష్ శనివారం గౌరవ వందనంతో ఘనంగా ప్రారంభం చేశారు. ఇందులోనే మండల టిడిపి నాయకులు ధనుంజయ, మాజీ జడ్‌పిటిసి చంద్రశేఖర్, పాఠశాల చైర్మన్ రాజాలరామమోహన్ రెడ్డి, గోవింద్, పిజికల్ డైరెక్టర్ రఘునాథ్, వలి, ఈరన్న తదితరులు పాల్గొన్నారు. అనంతరం హోరా హోరీగా ఆడుతున్న క్రీడలను ఆసక్తిగా తిలకించి సిబెళగల్‌లో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించడం హర్షనీయమని తెలిపి ప్రతిభను చాటాలని అప్పుడే విద్యార్థులు లక్ష్యాలను సాధిస్తారని పలువురు పేర్కొన్నారు.

మచ్చలేని నేత దామోదరం సంజీవయ్య

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్


మాట్లాడుతున్న దామోదరం రాధాకృష్ణమూర్తి

ఎంతో ఉన్నతంగా ప్రజలకు సేవ చేసి బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధికి పాటుపడిన మహనీయులు దామోదరం సంజీవయ్య అని దామోదరం సంజీవయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దామోదరం రాధాకృష్ణ మూర్తి అన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలోని చేనేత భవన్ లో మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 22వ వర్ధంతి నిర్వహించారు. సర్దార్ బుచ్చిబాబు మాట్లాడుతూ ఎంతో ఉన్నతంగా ప్రజలకు సేవ చేసి బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి పథంలో నడిపారని చారిటబుల్ ట్రస్టీ ఈశ్వరయ్య అన్నారు. బలిజ సంఘం నాయకులు ప్రేమ్ కుమార్ రెడ్డి, సీనియర్ న్యాయవాది మధుసూదన్, భారత్ కిసాన్ రాష్ట్ర అధ్యక్షులు ఖాద్రి, దామోదరం సంజీవయ్య చారిటబుల్ ట్రస్టీ పోతుల శేఖర్, బి ఎస్ ఐ జిల్లా అధ్యక్షులు పుసులూరి చిరంజీవి, ఐఎన్ టి యు సి జిల్లా కార్యదర్శి ఎం సుంకన్న, డాక్టర్ గోవర్ధన్, పాండు, పెరికల రంగస్వామి పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఖాజాబేగ్

ప్రజాశక్తి - వెల్దుర్తి



ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం బోయినపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఖాజా బేగ్‌ను ఎంపిక చేశారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డుకు ఎన్నికైనందుకు బోయినపల్లి గ్రామంలోని పాఠశాలలో పనిచేస్తున్నటువంటి ఉపాధ్యాయులు, బోయినపల్లి గ్రామ పెద్దలు టిడిపి నాయకులు నర్సింగ్ కాంతరెడ్డి, వైసిపి నాయకులు నర్సింగ్ అశోక్ కుమార్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ట్రాఫిక్ అవేర్ నెస్, కౌన్సిలింగ్ సెంటర్‌ను ప్రారంభించిన ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా మార్గదర్శకాలు, ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని కర్నూలు జిల్లా ఎస్‌పి జి. బిందు మాధవ్ అన్నారు. శనివారం కర్నూలు కొత్తపేట దగ్గర ఆధునీకరించిన ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ట్రాఫిక్ అవగాహన కౌన్సిలింగ్ సెంటర్ ను ఎస్‌పి ప్రారంభించారు. ఎస్‌పి మాట్లాడుతూ...కర్నూలులో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ప్రమాదాలను తగ్గించేందుకు, ట్రాఫిక్ అంతరాయం లేకుండా సజావుగా సాగేందుకు ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతమైన డ్రైవింగ్ చేయాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఆటో డ్రైవర్లు తమ భద్రతకు, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆటో డ్రైవర్లందరూ తప్పనిసరిగా ఆటోల రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. డ్రైవర్లు నిర్లక్ష్యపు డ్రైవింగ్, డ్రైవింగ్‌లో మొబైల్ ఫోన్లు ఉపయోగించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ఓవర్‌లోడింగ్ చేయడం వంటివి చేయకూడదన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఆటోలను నిర్ణీత ప్రాంతాల్లో మాత్రమే పార్కింగ్ చేయాలన్నారు. మైనర్లు వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు ఎక్కువ అవుతున్నాయన్నారు. ఎవరైతే లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే మైనర్ల తల్లిదండ్రులను పిలిపించి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చేత ట్రాఫిక్ రూల్స్ గురించి లఘు చిత్రాల ద్వారా కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. కర్నూలు లో 5 వేలకు పైగా ఆటోలు ఉన్నాయన్నారు. ఎవరైనా ఒక వ్యక్తి ఆటో ఎక్కడానికి చేయి చాపడంతో ఆటో వాళ్ళు వెంటనే ముందు వెనక ఆలోచించకుండా ఆటోని అక్కడనే ఆపుతున్నారన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలుగుజేస్తూ, వెనుకవచ్చే వారికి ప్రమాదాలకు గురిచేయకూడదన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగనీయకుండా ఆటోలు నడపాలన్నారు. ప్రతి ఆటోకు పోలీసు గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు , నేరాలను అరికట్టడంలో ప్రజల సహకారం ఎంతో ముఖ్యమన్నారు. ఎక్కడైనా అనుమానాస్పద కార్య కలాపాలు జరిగినా డయల్ 112 కు గాని, డయల్ 100 కు గాని పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ప్రజలకు జిల్లా ఎస్‌పి విజ్ఞప్తి చేశారు. కర్నూలు డిఎస్‌పి జె.బాబు ప్రసాద్, ట్రాఫిక్ సిఐ మన్సూరుద్దీన్ , కర్నూలు పట్టణ సిఐలు రామయ్యనాయుడు, నాగరాజారావు, మురళీధర్ రెడ్డి, మధుసూధన్ గౌడ్, పవన్ కుమార్ , ట్రాఫిక్ ఆర్ ఎస్ఐ హుస్సేన్ , ఆటో యూనియన్ సంఘాలు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్‌పి జి.బిందుమాధవ్

ప్రజల కష్టాలు పట్టించుకోని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కూటమి ప్రభుత్వం ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి విమర్శించారు. కర్నూల్, ఓల్డ్ సిటీ ప్రాంతంలోని కవాడివీధి,రంగరాజు వీధి,చిన్న మార్కెట్, వన్ టౌన్ ప్రాంతాలలో సిపిఎం పోరుయాత్ర నిర్వహించి ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు డి.అబ్దుల్ దేశాయి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్,నగర కార్యదర్శి ఎం రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్రంలో ఉండే బిజెపి, రాష్ట్రంలోటిడిపి ప్రభుత్వాలు ప్రజలపై నిత్యావసర వస్తువుల ధరలు పెంచడమేకాక విద్యుత్ చార్జీల భారాన్ని మోపడం ఎంతవరకు సమంజసం ప్రశ్నించారు. ఒకవైపున ప్రభుత్వ రంగ పరిశ్రమలను మూత వేసి ఉన్న ఉపాధిని లేకుండా చేస్తున్నారని, ఎన్నికల ముందు నిరుద్యోగ యువతకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బిజెపి వాగ్దానం ఆటకెక్కిందని, అదేవిధంగా రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు ఆటకెక్కాయని దుయ్యబట్టారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ దేశంలో మతాలను, మత విశ్వాసాలను, ధర్మాలను కాపాడటానికి రాజ్యాంగ వ్యవస్థలు ఉన్నాయనడం అవగాహనా రాహిత్యం అన్నారు. ధర్మ పరిరక్షకునిగా లేకున్నా పర్వాలేదు ప్రజల కష్టాలను తెలుసుకొని ధరల బారాలను తగ్గించాలని డిమాండ్ చేశారు.



ప్రజాపోరు లో మాట్లాడుతున్న కెవి.నారాయణ

కోడుమూరు రూరల్: కోడుమూరు పట్టణంలో శాంతినగర్ మాల వీధి పాత బస్టాండ్ సంత మార్కెట్ వీధుల్లో సిపిఎం ప్రజాపోరు పాదయాత్ర నిర్వహించారు సిపిఎం మండల కమిటీ సభ్యులు కె.రాజు. అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి. నారాయణ వీధి వీధినా తిరిగారు. కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేశారు. ప్రజా సమస్యలపై ఆయన మాట్లాడారు. మండల కార్యదర్శి గఫర్ మియా, నాయకులు జిపి. వీరన్న , కె.లక్ష్మన్న , టి.వీరన్న, మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

కర్నూలు కార్పొరేషన్ : సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు విజయ రామాంజనేయులు నాయకత్వంలో ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో 17వ వార్డు సప్తగిరి నగర్ సంజయ్ గాంధీనగర్ చాణిక్యపురి కాలనీలో ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించారు. పాలకుల విధానాలను ఎండగడుతూ కరప్రతాలు పంపిణీ చేశారు. సి పి ఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎం డి షరీఫ్ నాయకత్వంలో ఎస్ నాగప్ప వీధి, లాల్ బహదూర్ శాస్త్రి నగర్, మాలగేరి,సాయిబాబా గుడి వెనక భాగం, జిల్లా కోర్టు ఆవరణంలో ఈ ప్రజా పోరు పాదయాత్ర కార్యక్రమం నిర్వహించారు.



సోమిశెట్టి వెంకటేశ్వర్లును అభినందిస్తున్న కార్పొరేటర్లు, టిడిపి నాయకులు

కుడా చైర్మన్‌గా సోమిశెట్టి వెంకటేశ్వర్లు

రెండోసారి వరించిన పదవి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్‌గా టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈమేరకు శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆయనకు రెండోసారి అవకాశం కల్పిస్తూ కుడా చైర్మన్ గా నియమించింది. 1982 నుంచి టిడిపిలో ఆయన రాజకీయ ప్రవేశం చేసి పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ వచ్చారు. వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్‌టి రామారావు తోను ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అనంతరం చంద్రబాబు నాయుడుతో అత్యంత విశ్వసనీయంగా కలిసి నడిచారు. పార్టీ కష్టకాలంలో సైతం పార్టీ నిర్మాణ బాధ్యతలను భుజాన వేసుకొని ముందుకు నడిచారు. 2016లో కుడా తొలి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఘనత ఆయనకే దక్కింది.

జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా : పార్టీకి నిరంతరం అంటిపెట్టుకొని కష్టసుఖాల్లో నిలబడిన తనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్, టిజి.భరత్ తగిన గౌరవాన్ని కట్టబెట్టారు. వారికి ఎల్లవేళలా రుణపడి ఉంటా. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా. జిల్లాలో ఎలాంటి అవినీతికి తావు లేకుండా అభివృద్ధిపై దృష్టిని సారించి ముందుకు తీసుకువెళతానని నూతన కుడా చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఆయనను కలిసిన ప్రజాశక్తితో తెలిపారు.

సోమిశెట్టిని అభినందించిన టిడిపి నాయకులు

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లును ముఖ్యమంత్రి చంద్రబాబు కుడా చైర్మన్ గా నియమించిన సంధర్భంగా కార్పొరేటర్లు కురువ పరమేశ్ (8వ వార్డు), బి.నవీన్ (9వ వార్డు), రాష్ట్ర పార్టీ కార్యదర్శి నంద్యాల నాగేంద్ర, కె.శ్రీకాంత్, డి.కృష్ణ, జి.శ్రీధర్, ఆర్.సత్య తదిరులు అభినందించారు. టిడిపి కర్నూలు కార్యాలయంలో సోమిశెట్టి వెంకటేశ్వర్లును కలిసి పుష్పగుచ్చం ఇచ్చి అభినందనలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి-తుగ్గలి



తుగ్గలిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త ఓటర్లు , తప్పుల సవరణ ప్రత్యేకంగా ఓటర్ నమోదు కార్యక్రమం శనివారం ప్రభుత్వంనిర్వహిస్తోంది. ఆర్‌డి ఎస్ భరత్ నాయక్ పోలింగ్ బూతులను తనిఖీ చేశారు. అక్కడున్న బిఎల్‌ఒలను ఓటర్ లిస్ట్‌ను పరిశీలించినారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ బి.నాగరాజు, విఆర్ఒ నవీద్ పాటిల్ రెడ్డి, విఆర్ఎలు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని



సమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్

హాస్టల్‌లో వసతి పొందుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా, తాగునీటి వసతి, వసతి గృహంలో మౌలిక సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్యలుంటే నేరుగా తన దగ్గరికి వచ్చి తెలపవచ్చని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు.

అన్ని వర్గాలకూ సముచిత న్యాయం

- టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని



సభ్యత్వం ఇస్తున్న ఉమాపతి నాయుడు

ప్రభుత్వంలో అన్ని సామాజిక వర్గాలకూ భాగస్వామ్యం ఇస్తూ, అందరికీ సముచిత స్థానం కల్పిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దక్కుతుందని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు తెలిపారు. శనివారం టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు ఉమాపతి నాయుడు ఆధ్వర్యంలో సంతేకుడ్లురు, పట్టణంలోని వివిధ వార్డుల్లో టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పదవుల కేటాయింపుల్లో సామాజిక న్యాయం పాటిస్తూ అన్ని కులాల వారికి ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తున్నారని తెలిపారు. నామినేటెడ్ పోస్టుల కేటాయింపుల్లో కూడా దామాషా పద్ధతిన న్యాయం చేకూర్చారన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని విమర్శించారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడవక ముందే ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రగతిని గాడిలో పెట్టారన్నారు. అలాంటి నాయకునికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. టిడిపి సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను సామాన్యులకు వివరించాలని తెలిపారు. నాయకులు గోవిందప్ప, ఎల్లప్ప, మల్లికార్జున, సోమన్న, కేశప్ప, బాబు నాయుడు, రంగన్న, కృష్ణారెడ్డి ఉన్నారు.

30 ఏళ్ల తర్వాత సొంత గూటికి

- నేపాల్ నుంచి రప్పించిన 'వేదాస్'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులతో మతిస్థిమితం లేని వ్యక్తి

పట్టణానికి చెందిన మతిస్థిమితం లేని ఓ వ్యక్తి తప్పిపోయి 30 ఏళ్లయింది. ఆ కుటుంబం ఆయన కోసం వెతకని రాష్ట్రం లేదు. కంటతడి పెట్టని రోజు లేదు. 30 ఏళ్ల తర్వాత పొరుగు దేశమైన నేపాల్‌లో గల ఆశ్రమ నిర్వాహకులు ఎమ్మిగనూరులోని వేదాస్ నిరాశ్రయుల వసతి గృహం యాజమాన్యం అందించే సేవల గురించి తెలుసుకున్నారు. వేదాస్ డైరెక్టర్ కె.సునీల్ కుమార్‌తో మాటామంతి జరిపారు. వేదాస్ నిరాశ్రయుల వసతి గృహం నిర్వాహకులు ఆయన ఎప్పుడు తప్పిపోయాడో, వారి కుటుంబీకులు ఎవరో అంటూ మొత్తంగా ఆరా తీసి నేపాల్‌లో గల ఆశ్రమ నిర్వాహకులకు కబురు పెట్టారు. ఆ దేశం నుంచి ఈ దేశానికి టికెట్లు బుక్ చేసుకున్నారు. 30 ఏళ్లు దూరంగా ఉన్న మతిస్థిమితం లేని వ్యక్తిని కుటుంబానికి దగ్గర చేశారు. వేదాస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులకు ఆ కుటుంబం శనివారం కృతజ్ఞతలు తెలిపారు. వేదాస్ స్వచ్ఛంద సంస్థలు, ఎంబి.ఎరుషలేం సంఘం నేపాల్ నుంచి ఇంత దూరం ప్రయాణించిన నేపాల్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుల దారి ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు ఇచ్చి వారిని కర్నూలు దాకా తీసుకెళ్లి నేపాల్‌కు సాగనంపారు. ఎంబి.ఎరుషలేం సంఘం కార్యదర్శి భాస్కర్ బాబు, తిమ్మరాజు, పౌల్ రాజు, ఆనంద్ రాజు, పాస్టర్ డేవిడ్, సంస్థ సెక్రటరీ ప్రభాకర్, శాంతిరాజు పాల్గొన్నారు.

కర్నూలు విఆర్‌కు ఆలూరు సిఐ

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు సిఐ కె.శ్రీనివాస్ నాయక్ కర్నూలు విఆర్‌కు బదిలీ అయ్యారు. శనివారం రాయలసీమ డిఐజి కోయ ప్రవీణ్ ఆదేశాలతో జరిగిన సిఐల బదిలీల్లో భాగంగా ఆలూరు సిఐ కర్నూలు విఆర్ (వెహికెన్సీ రిజర్వ్‌డ్)కు, అన్నమయ్య జిల్లా ఎస్‌బి-3 నుంచి ఆలూరు సిఐగా బి.వెంకట చలపతిని బదిలీ చేశారు. చిప్పగిరి మండలంలో ఒక హత్య కేసును ఛేదించడంలో నిర్లక్ష్యం వహించిన నేపథ్యంలో విఆర్‌కు పంపినట్లు సమాచారం.

సబ్ కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

● భవనం ఖాళీ చేయని 'నాక్' నిర్వాహకులు ● ప్రాణ నష్టం జరిగితేనే స్పందిస్తారా ● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణ శివారులోని కళాశాల ఎస్సీ బాలుర హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. భవనం పైకప్పు పెచ్చులూడి పడిపోతోంది. ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనలో విద్యార్థులు ఉన్నారు. భవనాన్ని ఖాళీ చేయాలని సబ్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా నాక్ నిర్వాహకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఖాళీ చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

హాస్టల్‌లో ఇంటర్ నుంచి డిగ్రీ, పిజి చదివే విద్యార్థులు 130 మంది ఉన్నట్లు హాస్టల్ నిర్వాహకులు చెబుతున్నారు. పట్టణంలో పోలీసు కంట్రోల్ రూమ్ సమీపంలో ఎస్సీ వెల్ఫేర్‌కు సంబంధించిన హాస్టల్ భవనం ఉంది. ఆ భవనంలోకి కళాశాల హాస్టల్‌ను మార్చాలని విద్యార్థులు కోరుతున్నారు. గతంలో ఆ భవనం ఖాళీగా ఉండడంతో నాక్ సెంటర్ నిర్వహణకు అప్పగించారు. ప్రస్తుతం నాక్ సంబంధించిన కార్యకలాపాలు కూడా లేకపోవడంతో ఆ భవనం నిరుపయోగంగా ఉంది. కళాశాల విద్యార్థులను ఆ భవనంలోకి మారిస్తే కళాశాలలకు వెళ్లేందుకు అనుకూలంగా ఉంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న కళాశాల హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. విద్యార్థులను ఖాళీ చేయిస్తే మరమ్మతులకు ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు. నాక్ సెంటర్ నిర్వాహకులు భవనం ఖాళీ చేయకుండా నిర్లక్ష్యం చేయడంతో ఆగ్రహించిన ఎస్ఎఫ్ఐ నాయకులు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు పలుమార్లు విన్నవించారు. భవనం ఖాళీ చేయించాలని సంబంధిత అధికారులకు సబ్ కలెక్టర్ మౌఖికంగా ఆదేశాలు ఇచ్చారు. నిర్లక్ష్యం చేయడంతో విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పెచ్చులూడిన భవనం పైకప్పును చూపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు (ఫైల్)

సబ్ కలెక్టర్ ఆదేశాలు భేఖాతరు

నాక్ సెంటర్ నిర్వహణ భవనం ఖాళీ చేయించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు మరోసారి వినతిపత్రం ఇచ్చారు. ఖాళీ చేయించాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని సబ్ కలెక్టర్ ఎస్ఎఫ్ఐ నాయకులకు తెలిపారు. ఖాళీ చేయలేదని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు సబ్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. నాక్ సెంటర్ నిర్వహణకు మరో చోట భవనం కేటాయించారని తెలిసింది. ఖాళీ చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఆగ్రహించిన సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సోషల్ వెల్ఫేర్ అధికారులపై మండిపడ్డారు. వెంటనే ఖాళీ చేయించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ హెచ్చరించారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

- పత్తి, మిరప పంట ఆహుతి - అన్నదాతకు అపార నష్టం

ప్రజాశక్తి - ఆస్పరి

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని కైరుప్పల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. బాధిత రైతు వివరాల మేరకు... కైరుప్పల గ్రామానికి చెందిన రైతు పక్కీరప్ప ఆరెకరాల్లో రూ.3 లక్షలు ఖర్చు చేసి పత్తి పంట సాగు చేశారు. రెండెకరాల్లో రూ.2 లక్షలు ఖర్చు చేసి బ్యాడ్గి మిరప సాగు చేశారు. 30 క్వింటాళ్ల పత్తి, 2 క్వింటాళ్ల మిరప కోత కోసి రైతు ఇంట్లో నిల్వ చేసుకున్నారు. సిలిండర్ పేలడంతో ఇంటి పై కప్పుతోపాటు ఇంట్లో ఉన్న పత్తి, మిరప, రెండు వెండి పట్టీలు, రూ.30 వేల నగదు, నిత్యావసర సరుకులు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామస్తులు సంఘటన విషయాన్ని వెంటనే పత్తికొండ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చేలోపు నష్టం జరిగిపోయింది. దాదాపు రూ.5 లక్షల దాకా నష్టం వాటిల్లిందని రైతు వాపోయారు. రైతుకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతుసంఘం మండల కార్యదర్శి రంగస్వామి, సర్పంచి తిమ్మక్క, వీర బద్రి, నరసింహులు కోరారు.




మంటలను ఆర్పేస్తున్న సిబ్బంది

మాదిగలకు సముచిత స్థానం

- టిడిపి నాయకులు వీరేష్

ప్రజాశక్తి - ఆదోని

ముఖ్యమంత్రి చంద్రబాబు మాదిగలకు సముచిత స్థానం కల్పించారని టిడిపి నాయకులు వీరేష్ తెలిపారు. శనివారం ఎపి మాదిగ వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన మాదిగల అభివృద్ధికి పాటుపడాలని కోరామని తెలిపారు. స్వయం ఉపాధి కోసం కార్పొరేషన్ ద్వారా రుణాలిచ్చి మాదిగలు ఆర్థికంగా బలోపేతమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఛైర్మన్ సానుకూలంగా స్పందించారని వీరేష్ తెలిపారు.




ఉండవల్లి శ్రీదేవితో వీరేష్

'సూపర్ సిక్స్'ను అమలు చేయాలి

● సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ
● రెండో రోజూ ప్రజాపోరు

ప్రజాశక్తి- ఆదోని

అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాల అమలు చేస్తామని ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలో కల్లుబావి, శంకర్ నగర్ ప్రాంతంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై ప్రజా పోరు కార్యక్రమం శనివారం రెండో రోజూ సాగింది. అంతకుముందు ప్రజాపోరు గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న, ముక్కన్న, మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకపోవడం దారుణమని మండిపడ్డారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500, రైతు భరోసా కింద రూ.20 వేలు తదితర పథకాలు నేటికీ అమలుకు నోచుకోలేదని తెలిపారు. సిపిఎం పట్టణ నాయకులు వీరేష్, నాగేంద్ర, నాగరాజు, మల్లయ్య, రాజు ఉన్నారు. **ఆలూరు** మండలంలోని అరికెర, కరిడిగుడ్డం, ముద్దనగేరి, కురుకుంద, హులేబీడు, తుంబలబీడు గ్రామాల్లో సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి ఆధ్వర్యంలో ప్రజాపోరు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ మాట్లాడారు. గ్యాస్ సిలిండర్లు కూడా ఉచితమని చెప్పిన చాలామందికి డబ్బులు ఖాతాలో పడలేదన్నారు. ట్రూ అఫ్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. **ఎమ్మిగనూరు** పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా పోరు పేరుతో ఎన్‌టిఆర్ కాలనీలో ప్రచారం నిర్వహించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి పి.గోవిందు, పట్టణ కమిటీ సభ్యులు రాముడు, కృష్ణ మాట్లాడారు. ఎమ్మిగనూరు టిడ్కో ఇళ్లకు రోడ్లు, డ్రైయినేజీ, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. సిపిఎం కార్యకర్తలు ఉస్మాన్ వలీ, లక్ష్మన్న, శేఖర్, పరమేష్, మోహిన్, చంద్ర పాల్గొన్నారు. **గోనెగండ్ల** మండలంలోని బి.అగ్రహారం గ్రామంలో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. సిపిఎం మండల నాయకులు నరసింహులు, గిరిరాజు మాట్లాడారు. బి.అగ్రహారం గ్రామంలో ప్రజలంతా ఎదుర్కొంటున్న శ్మశాన సమస్యను అధికారులు ప్రత్యేక చొరవతో పరిష్కరించాలని కోరారు. ఈనెల 15న గోనెగండ్ల ఎంపిడిఒ కార్యాలయం ముందు జరిగే ఆందోళనలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పెద్దయ్య, రమేష్, బాబు, ఫక్రుద్దీన్, ప్రభాకర్ రెడ్డి, బంగారప్ప, వెంకటేష్, రంగస్వామి, గోవిందు, పరమేష్, హనుమంతు రెడ్డి, తిమ్మారెడ్డి, రామిరెడ్డి, మోటి లక్ష్మన్న, చిన్న హనుమంతు, పెద్ద దిగ్గెన్న, గుడిసె హనుమంతు పాల్గొన్నారు.



ఆలూరులో మాట్లాడుతున్న రాధాకృష్ణ



ఆదోనిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు



ఎమ్మిగనూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆదోని

అనారోగ్య, విపత్కర పరిస్థితుల్లో ఉన్నప్పుడు మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వం అందిస్తున్న సిఎం రిలీఫ్ ఫండ్‌ను పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. శనివారం ఆదోని మండలం దొడ్డనకేరి గ్రామానికి చెందిన బుడిజగ్గుల మునిస్వామి అనే వ్యక్తికి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.1,06,901 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆరోగ్యశ్రీ పేరుతో కొన్ని ఆస్పత్రులు అక్రమాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పద్ధతి మార్చుకోవాలని పేర్కొన్నారు. కార్పొరేట్ ఆస్పత్రిలో కూడా ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా మెరుగైన వైద్యం అందిస్తారని తెలిపారు. ఎలాంటి నగదూ చెల్లించాల్సిన అవసరం లేదని వివరించారు. నాయకులు శివప్ప, బాలస్వామి, రాజు ఉన్నారు.

బోయ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బొజ్జమ్మ

ప్రజాశక్తి - దేవనకొండ



బోయ వెల్ఫేర్ రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్‌గా కప్పట్రాళ్ల బొజ్జమ్మ ఎన్నికైనట్లు రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. నామినేటెడ్ పదవుల ఎంపికలో భాగంగా టిడిపి అభివృద్ధికి కృషి చేసిన వారికి ఈ పదవులను కట్టబెట్టింది. కప్పట్రాళ్ల వెంకటప్ప నాయుడు చాలా ఏళ్లుగా టిడిపి అభివృద్ధికి, బలోపేతానికి ఎంతో కృషి చేశారు. ఆయన మరణం తర్వాత ఆయన కుమార్తె బొజ్జమ్మ టిడిపికి విధేయులుగా ఉంటూ అభివృద్ధికి కృషి చేశారు. వారి సేవలకు గుర్తింపుగా కార్పొరేషన్ ఛైర్మన్‌గా పదవి కట్టబెట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బాబుకు, ఆయన కుమారుడు లోకేష్‌కు మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు, బొజ్జమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

మినీ గోకులం షెడ్లను త్వరగా నిర్మించుకోండి : ఎపిఒ



పశువులకు అనువుగా ఉన్న షెడ్డు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలో మినీ గోకులం షెడ్లు మంజూర యిన లబ్ధిదారులందరూ త్వరగా నిర్మించుకోవాలని ఎపిఒ జుబేర్ అహ్మద్ లబ్ధిదారులకు సూచించారు. శనివారం దౌల్తాపురంలో నూతనంగా నిర్మించిన మినీ గోకులం షెడ్డును పరిశీలించి మాట్లాడారు. మినీ గోకులం షెడ్లు ఎంత త్వరగా నిర్మించుకుంటే అంత త్వరగా నిధులు మంజూరవుతాయని తెలిపారు. ఏ ఒక్కరూ సందేహం పడనవసరం లేదన్నారు. వ్యవసాయం చేసుకునే రైతులకు మినీ గోకులం షెడ్లు చాలా ఉపయోగపడతాయని తెలిపారు. పశువులకు, వ్యవసాయ పనిముట్లకు, వర్షానికి తడవకుండా పశువుల మేత పెట్టుకోవడానికి ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వం రైతుల కోసం ఈ పథకం తెచ్చిందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గర్భధారణ సమయంలో

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి

- జిల్లా విశ్రాంత ఉప వైద్యాధికారి డాక్టర్ రామామణి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



గర్భధారణ సమయంలో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం మంచిదని జిల్లా విశ్రాంత ఉప వైద్యాధికారి డాక్టర్ రామామణి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడారు. గర్భిణీకి, పుట్టబోయే బిడ్డకు మంచి ఆహారం తీసుకోవాలని తెలిపారు. ధాన్యాలు, ప్రోటీన్లు, కూరగాయలు, పండ్లు, పాల వంటి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ ఆహారాల నుంచి ఫోలిక్ యాసిడ్, ఐరన్, కాల్షియం, విటమిన్ 'డి' వంటి పోషకాలకు మంచి మూలాలు గర్భిణులకు, పుట్టబోయే బిడ్డకు ఉపయోగపడతాయన్నారు.

జాగ్రత్తలతో ఆరోగ్యం పదిలం

పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే, గర్భిణీ ఆరోగ్యంగా ఉండాలంటే జాగ్రత్తలు తీసుకోవాలి. గర్భిణులు ఆహారం తీసుకునే విషయంలో కొన్ని సూచనలు పాటించాలి. గర్భిణీ సమయంలో తల్లి ఆరోగ్యానికి, బిడ్డ పెరుగుదలకు సరిపోయే ఆహారం కొంచెంకొంచెంగా ఎక్కువ సార్లు తినాలి. కాల్షియం, ఐరన్ అధికంగా ఉన్న ఆహారం తీసుకోవాలి. పుల్లటి పండ్లు తీసుకోవాలి. పాలు, మాంసం, గుడ్లు, చేపలు, కొవ్వు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. సరైన విశ్రాంతి తీసుకోవాలి. గర్భిణుల్లో రక్తహీనత సమస్య ఉంటుంది. దీని వల్ల బరువు తక్కువ ఉన్న బిడ్డలు పుట్టడం, తల్లికి అధిక రక్తస్రావం అవుతుంది. ఐరన్ ఎక్కువగా ఉన్న ఆహారం అంటే ఆకుకూరలు, బెల్లం, రాగులు, ఎండిన పండ్లు (కర్జూరం, ద్రాక్ష), నువ్వులు, చెరకురసం, ఉలవలు తీసుకోవాలి. రోజుకు ఒకటి చొప్పున ఐరన్ మాత్రలు తీసుకోవాలి. కొన్ని రకాల పండ్లు, ఆహార పదార్థాలు తినడం వల్ల సమస్యలు వస్తాయని గర్భిణుల్లో ఎక్కువ అపోహలుంటాయి. ఎలాంటి సమస్యలూ తలెత్తే అవకాశం ఉండదు. బొప్పాయి తినడం వల్ల గర్భస్రావం అవుతుందనడం ఎంత మాత్రం నిజం కాదు. ఇందులో అధిక కేలరీలు ఉంటాయి. అందుకే తొందరగా జీర్ణం కాదు. కొబ్బరి నీళ్లు తాగడం అందరికీ మంచిది. ఇందులో ఎక్కువ మోతాదులో పొటాషియం, లవణాలు ఉంటాయి. మాంసాహారం, గుడ్లు తినడం వల్ల ఎలాంటి నష్టమూ ఉండదు. ఇందులో ఎక్కువ కేలరీలు ఉంటాయి. నారింజ, అనస పండ్లు తినడం వల్ల వెంటనే జలుబు వచ్చేయదు. అవి శీతాకాలంలోనో, చల్లగా ఉన్నప్పుడో తింటే జలుబు చేసే అవకాశం ఉంటుంది. బీట్‌రూట్‌లో ఇనుము, బీటా కెరోటిన్లు క్యారెట్ కన్నా ఎక్కువ మోతాదులో ఉంటాయి. బీట్‌రూట్ కన్నా క్యారెట్ కొంత వరకూ మంచిదే. అరటిపండు తినడం వల్ల పిల్లలు నల్లగా పుట్టరు. జున్ను తింటే ఆరోగ్యానికి ఎంతో మంచిది. దీనిలో ఎక్కువగా కొవ్వు పదార్థాలు ఉంటాయి. ఎక్కువ తింటే అజీర్ణం చేయవచ్చు. అందుకే మిరియాలను కలుపుకొని తినాలి. దానివల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదు.

యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా

ఐక్య కార్యాచరణ

● రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో యురేనియం తవ్వకాలపై భవిష్యత్తులో ఐక్య కార్యాచరణ చేపట్టాలని, అవసరమైన మేర ఉద్యమాన్ని మరింతగా ఉధృతం చేయాలని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం దేవనకొండ మూగి తాత కమ్యూనిటీ భవనంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సిపిఐ మండల కార్యదర్శి నరసారావు అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, టిడిపి సీనియర్ నాయకులు మాలిక్ బాషా, ఆకుల వీరేష్, నెల్లిబండ మల్లికార్జున, జనసేన పార్టీ నాయకులు నందు, కాంగ్రెస్ నాయకులు మహేంద్ర నాయుడు, శ్రీనివాసులు మాట్లాడారు. ప్రజలు స్వచ్ఛందంగా ఆందోళన చేస్తున్నారని, కలెక్టర్ ఈ ప్రాంతంలో యురేనియం తవ్వకాలు జరపడం లేదని పత్రిక ప్రకటన చేశారని తెలిపారు. ప్రజల భయాందోళనలు ఇంకా తొలగిపోలేదని, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు యురేనియం తవ్వకాలపై స్పష్టంగా ప్రకటించాలని కోరారు. ఇప్పటికీ ప్రజల్లో తీవ్ర భయాందోళనలు ఉన్నాయని, ప్రభుత్వ పెద్దలు దీనిని గమనించాలని తెలిపారు. ఇప్పుడిప్పుడే మండలంలో ఫ్యాక్షన్ మరిచి ప్రజలు సాగునీటి ద్వారా రెండు పూటలు కడుపునిండా తినే పరిస్థితి ఉందని చెప్పారు. యురేనియం తవ్వకాలతో ఈ ప్రాంత రైతులను మరింతగా ఇబ్బంది పెట్టకూడదని కోరారు. కలెక్టర్ ఈ ప్రాంతానికి రావాలని, ఈ ప్రాంత ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి, అనుమానాలు తీర్చాలని తెలిపారు. రాజకీయ పార్టీలుగా కలెక్టర్‌ను కలవాలని, ప్రభుత్వానికి ఈ ప్రాంత ప్రజల మనోవేదన నివేదిక ద్వారా అందించాలని కోరతామని చెప్పారు. ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసేలా ఒత్తిడి తెచ్చేలా కలెక్టర్ కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ వైఖరిని బట్టి రాబోయే రోజుల్లో ఈ ప్రాంత ఉద్యమం ఉంటుందని, భవిష్యత్తులో ఏ తరహా ఉద్యమైనా అన్ని రాజకీయ పార్టీలు కలిసి ఐక్య కార్యాచరణ చేపడతామని పేర్కొన్నారు. సర్పంచి చిన్న రామప్ప, సిపిఎం నాయకులు యూసుఫ్ బాషా, అశోక్, సిపిఐ నాయకులు భాస్కర్, రవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరశేఖర్

వాణిజ్యశాస్త్ర పరిశోధనలపై దృష్టి సారించాలి

● కళాశాల ప్రిన్సిపల్ ఇర్ఫాన్ ● 'రావూస్'లో అంతర్జాతీయ అకౌంటింగ్ దినోత్సవం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రతి విద్యార్థి అకౌంటెన్సీ సబ్జెక్టుల పట్ల శ్రద్ధ కనబరుస్తూ వాణిజ్య శాస్త్రంలో పరిశోధనల వైపు దృష్టి సారించాలని కళాశాల ప్రిన్సిపల్ ఇర్ఫాన్ సూచించారు. శనివారం పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ అకౌంటింగ్ దినోత్సవం నిర్వహించారు. వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సిఇఒ తిరుమలరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా వాణిజ్య శాస్త్రానికి విశేషంగా కృషి చేసిన లూకా పాయోసిలి చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ ఇర్ఫాన్, వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు విజయ్ కుమార్, వీరేష్, సీనియర్ అధ్యాపకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి మాట్లాడారు. లూకా పాయోసిలి అకౌంటింగ్ విధానంలో జంట పద్దు విధానాన్ని ప్రవేశపెట్టి అకౌంటింగ్ సబ్జెక్టు రూపకల్పనకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఆయన ఆశయాలు ప్రతి కామర్స్ విద్యార్థికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. నేటి ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచంలోని దేశాల వాణిజ్య వ్యాపారాలు ఈ-కామర్స్ విధానంలో, డిజిటల్ చెల్లింపుల ద్వారా జరుగుతున్నాయని తెలిపారు. ఆధునిక టెక్నాలజీ కాలంలో వాణిజ్య శాస్త్ర అవసరం, ప్రాధాన్యత సంతరించుకుందని చెప్పారు. దేశంలో జిఎస్‌టి రాకతో యువతకు వివిధ అకౌంటింగ్ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. అలాగే ప్రతి కామర్స్ విద్యార్థి అకౌంటింగ్‌లో నైపుణ్యత కలిగి, కంప్యూటర్ నాలెడ్జ్‌తో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కోరారు. కళాశాల కామర్స్ విద్యార్థులు కామర్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు ఎస్‌బిఐ, కంప్యూటర్, ల్యాప్‌టాప్, ఆర్‌బిఐ, ఎటిఎం, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్, సిమెంటు పరిశ్రమ, వాణిజ్య, వాయు, రోడ్డు, జల రవాణాల నమూనాలు, బ్యాలెన్స్ షీట్, క్యాలిక్యులేటర్ నమూనాలు తయారు చేసుకొని వాటి గురించి చర్చించారు. ఈ నమూనాల తయారీలో నైపుణ్యత కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎస్‌బిఐ నమూనా తయారు చేసిన విద్యార్థిని సహీదకు మొదటి బహుమతి, ఎటిఎం నమూనా తయారు చేసిన ప్రసాద్‌కు రెండో బహుమతి, సిమెంట్ పరిశ్రమ నమూనా తయారు చేసిన నీరజకు మూడో బహుమతి వచ్చింది. కళాశాల కల్చరల్ ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జీ, వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి విజయ్ కుమార్, సీనియర్ అధ్యాపకులు వీరేష్, వెంకటేశ్వర్లు, గోరంట్ల, నూర్ బాషా, పాల్ రాజు, విజయరాజ్, నందిని, అన్నపూర్ణ, రాజేశ్వరి, శ్రుతి ప్రియా, సంపత్, ధనుంజయ, గోవిందు పాల్గొన్నారు.



లూకా పాయోసిలి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

విధేయతకు గుర్తింపు..!

- కురుబ/కురుమ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా మాన్వి దేవేంద్రప్ప

ప్రజాశక్తి - ఆదోని



ముఖ్యమంత్రిని కలిసిన దేవేంద్రప్ప


పార్టీ నిర్ణయాల పట్ల విధేయత ప్రదర్శిస్తూ అధిష్టానం పట్ల నమ్మకంతో నడుచుకున్న టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాన్వి దేవేంద్రప్ప సేవలను అధిష్టానం గుర్తించింది. నామినేటెడ్ పోస్టుల కేటాయింపు రెండో జాబితా శనివారం వెల్లడైంది. ఆ జాబితాలో ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన మాన్వి దేవేంద్రప్పకు కురుబ/కురుమ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి దక్కింది. దేవేంద్రప్ప మొదటి నుంచి టిడిపిలో చురుకుగా కొనసాగుతూ మండల స్థాయి లీడర్‌గా ఎదిగారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుకు ప్రియశిష్యునిగా గుర్తింపు తెచ్చుకున్నారు. సర్పంచి, జడ్‌పిటిసిగా సేవలు అందించారు. 2018 నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా మాన్వి దేవేంద్రప్ప సేవలు అందించారు. అధికారం లేనప్పుడు ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని పార్టీ మారకుండా అలాగే నిలబడ్డారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులుగా, కురువ సంఘం జిల్లా అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. 2024 ఎన్నికల్లో కర్నూలు పార్లమెంట్ నుంచి టిడిపి అభ్యర్థిగా బరిలో దిగేందుకు టికెట్ రేసులో నిలిచారు. పార్టీ పెద్దల సూచనతో బరి నుంచి విరమించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు గెలుపు కోసం అహర్నిశలు కృషి చేశారు. తాను అందించిన సేవలను గుర్తించాలని అధిష్టానానికి విన్నవించుకోగా నామినేటెడ్ కేటాయింపుల్లో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు సముచిత స్థానం కల్పించారని మాన్వి దేవేంద్రప్ప శనివారం హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధిలో వెనుకబడిన గ్రామం నుంచి ఛైర్మన్ స్థాయికి ఎదిగిన మాన్వి దేవేంద్రప్పకు పలువురు అభినందనలు అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆ వర్గం ప్రజలకు మేలు చేయాలని, రాజకీయంగా ఎదగాలని పలువురు ఆకాంక్షించారు. తనకు పదవి దక్కేందుకు సహకరించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జీలకు దేవేంద్రప్ప ధన్యవాదాలు తెలిపారు.

అడ్వకేట్‌కు పదవి : ఆదోని పట్టణానికి చెందిన న్యాయవాది సావిత్రికి రజక వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి దక్కింది. ఆమె కొన్నేళ్లుగా బిజెపి మహిళా నాయకులుగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ సావిత్రికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- టివిఎస్ మోపెడ్‌ను ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - గోనెగండ్ల



వెంకటేష్ (ఫైల్)

ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో టివిఎస్ మోపెడ్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. గోనెగండ్ల సిఐ ఎ.గంగాధర్ వివరాల మేరకు... శనివారం సి.బెళగల్ మండలం యనగండ్ల గ్రామానికి చెందిన తెలుగు వెంకటేష్ (49) అనే వ్యక్తి గోనెగండ్ల మండలం గాజులదిన్నె ఎల్ఎల్‌సి కాలువ వద్ద తన టివిఎస్ మోపెడ్ (ఎపి21సిజె 5195)పై ప్రధాన రహదారిపైకి వచ్చారు. రోడ్డును దాటుతుండగా (ఎపి 21జడ్ 0564) ఆర్‌టిసి బస్సును డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో టివిఎస్ మోపెడ్‌ను బస్సు ఢీకొట్టింది. తెలుగు వెంకటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను చికిత్స నిమిత్తం 108 వాహనంలో కోడుమూరు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. మృతుని కుమారుడు తెలుగు బడేసాబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.